సాక్షి
అనంతపురం
బుధవారం । 22 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.20,360

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20,360 పలికాయి.



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి ధర రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.1°/ 12.2°

జిల్లా అంతటా మంగళవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పాతుకుపోయిన డీటీలపై ఆరా

- వివరాలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం



'సాక్షి'లో వచ్చిన కథనం

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం అర్బన్: జిల్లా కేంద్రాన్ని వీడకుండా అనేక ఏళ్లుగా పాతుకుపోయిన డిప్యూటీ తహసీల్దార్లపై కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆరా తీస్తున్నారు. ఈ నెల 16న 'సాక్షి'లో ప్రచురితమైన 'పాతుకుపోయారు' కథనానికి ఆయన స్పందించారు. డిప్యూటీ తహసీల్దార్లు ఎందరు ఉన్నారు.. ఎవరు ఏ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్నారు.. ఎన్ని ఏళ్లుగా జిల్లా కేంద్రంలోనే ఉంటున్నారు.. తదితర వివరాలను నివేదిక రూపంలో ఇవ్వాలని పరిపాలనా విభాగం అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఆ మేరకు విభాగం సిబ్బంది వివిధ శాఖలకు ఫోన్ చేసి వివరాలు సేకరిస్తున్నారు.

ఏ–1గా శోభారాణి నియామకం

కలెక్టరేట్ పరిపాలనా విభాగం ఏ–1 క్లర్క్‌గా డిప్యూటీ తహసీల్దారు శోభారాణిని నియమించారు. మంగళవారం ఆమె బాధ్యతలను స్వీకరించారు. గత నెల 16న 'సాక్షి'లో ప్రచురితమైన ''అమ్మో ఏ–1 సీటా'' కథనానికి కలెక్టర్ స్పందించారు. అత్యంత కీలకమైన ఏ–1 స్థానంలో అనుభవం ఉన్న అధికారిని నియమించాలనే విషయంపై కసరత్తు చేసిన తరువాత శోభారాణిని నియమించినట్లు సమాచారం.

పోక్సో కేసులో ముద్దాయికి ఐదేళ్ల జైలు

గుంతకల్లు/అనంతపురం: పోక్సో కేసులో ముద్దాయికి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. అలాగే, రూ.1,000 జరిమానా విధించారు. గుంతకల్లు టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్‌వలి తెలిపిన మేరకు.. గుంతకల్లు తిలక్‌నగర్‌కు చెందిన షేక్ షేక్షావలి చిల్లర దుకాణం నడిపేవాడు. 2020 జనవరి 16న ఓ దళిత బాలిక చాక్లెట్ కొనుక్కోవడానికి దుకాణం వద్దకు వెళ్లింది. ఈ క్రమంలోనే షేక్షావలి ఆమెను లోపలికి పిలిచి తన ఒడిలో కూర్చోబెట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో భయపడిన బాలిక బిగ్గరగా అరుచుకుంటూ ఇంటికెళ్లి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి టూటౌన్ సీఐ చిన్న గోవిందప్ప, డీఎస్పీ ఖాసీంసాబ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసు నమోదు చేసి అనంతపురం జిల్లా కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో స్పెషల్ పీపీ ఈశ్వరమ్మ 14 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో జడ్జి రాజ్యలక్ష్మీ మంగళవారం ముద్దాయి షేక్షావలికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. అలాగే, రూ.1,000 జరిమానా విధించారు. బాలికకు ప్రభుత్వం నుంచి రూ.2 లక్షల పరిహారం అందించాలని ఆదేశించారు. కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సీఐ వెంకటేష్ నాయక్, గుంతకల్లు టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ పర్యవేక్షణలో లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు నాగార్జున, ఉదయ్ నాయక్‌లు సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టి ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేశారు. ఈ సందర్భంగా వారిని ఎస్పీ జగదీష్ అభినందించారు.

ముగిసిన కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థుల ఎత్తు కొలుస్తున్న ఎస్పీ జగదీష్


అనంతపురం: జిల్లాలో గత నెల 30 నుంచి సాగుతున్న కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం ముగిశాయి. వివిధ కారణాలతో గైర్హాజరైన వారితో పాటు ఎత్తు, ఛాతీ కొలతలకు అప్పీలు చేసుకున్న అభ్యర్థులకు ముగింపు రోజు అవకాశం కల్పించారు.

నేడు అల్ట్రా మారథాన్

అనంతపురం: ఆర్డీటీ ఆధ్వర్యంలో బుధవారం అల్ట్రా మారథాన్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ మంగళవారం తెలిపారు. బెళుగుప్ప మండలం వెంకటాద్రిపల్లిలో బుధవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే మారథాన్ మొత్తం 170 కిలోమీటర్ల మేర సాగి శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలోని ఆర్డీటీ కార్యాలయం వద్ద ముగుస్తుంది. స్పెయిన్‌కు చెందిన అల్ట్రామారథాన్ రన్నర్ జువెల్ మానువెల్ నేతృత్వంలో భారతదేశానికి చెందిన 120 మంది మొత్తం నాలుగు బృందాలుగా కార్యక్రమంలో పాల్గొననున్నారు. 10 కిలోమీటర్లు ఏకధాటిగా ఒక టీం రన్నింగ్ చేస్తుంది.

ప్రజా ప్రతినిధి..

పైసా వసూల్



- 'అనంత'లో వసూళ్ల పర్వం
- ఎగ్జిబిషన్ నిర్వహణకు రూ. పది లక్షల డిమాండ్
- లేదంటే అనుమతులు ఇవ్వొద్దని అధికారులకు ఫోన్లు
- టీడీపీలోనే మరో వర్గాన్ని ఆశ్రయించిన బాధితుడు
- రచ్చ అవుతుందని గ్రహించి వెనక్కి తగ్గిన ప్రజాప్రతినిధి

కూటమి ప్రభుత్వం రాగానే ఆ ప్రజాప్రతినిధి అక్రమాలకు దారులు తెరిచారు. పోలీసులను గుప్పిట పెట్టుకున్నారు. వ్యాపారులను ముందుగా ఇంటికి పిలిపించి ఇంతని ఫిక్స్ చేస్తున్నారు. దారికి రాకుంటే తన 'అధీనం'లోని ఖాకీలను రంగంలోకి దింపుతున్నారు. ఇప్పటికే తనకు కనిపించిన అన్నింటి పైనా పడి దోచుకుంటున్న ఆయన.. తాజాగా చిన్న చిన్న వ్యాపారులనూ బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడడం విస్తుగొల్పుతోంది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధి వసూళ్ల దెబ్బకు వ్యాపారులు మొదలు బిల్డర్ల వరకూ హడలెత్తిపోతున్నారు. ఇప్పటికే పీడీఎస్ బియ్యం నుంచి ప్రారంభించి కార్పొరేషన్ పరిధిలో అక్రమణదారుల వరకూ అందరితోనూ వసూళ్ల బేరం మొదలెట్టిన సదరు ప్రజాప్రతినిధి... తాజాగా ఎగ్జిబిషన్, సర్కస్ కంపెనీల నిర్వాహకులనూ వదల్లేదు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాహనాలను నిలుపుకోవాలంటే కూడా ఒక్కో వాహనదారుడు రూ.2 వేలు ఇవ్వాలని పట్టుబట్టారు. ఆయన 'పైసావసూల్' పర్వం ఇప్పుడు నగరంలో హాట్ టాపిక్‌గా మారింది.

రూ. పది లక్షలిస్తేనే ఎగ్జిబిషన్..!

ఇటీవల రుద్రంపేటలో ఎగ్జిబిషన్ పెట్టేందుకు ఓ వ్యక్తి అధికారులకు అర్జీ పెట్టుకున్నారు. అన్ని విభాగాలకు మామూళ్లివ్వనిదే అనుమతులు ఇవ్వలేదు. ఇంతలోనే సదరు ప్రజాప్రతినిధి నుంచి ఫోన్ వచ్చింది. వెళ్లి కలవగానే.. రూ.10 లక్షలు ఇస్తేనే ఎగ్జిబిషన్ పెట్టుకోవాలని, లేదంటే కుదరదని తేల్చి చెప్పారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు తాను ఇవ్వలేనని కరాఖండీగా చెప్పి వచ్చేయగా... సదరు ప్రజాప్రతినిధి ఫోర్త్ టౌన్ సీఐకి ఫోన్ చేసి ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇవ్వొద్దని ఆదేశించారు. ఈ క్రమంలోనే సీఐ నుంచి ఫోన్ రావడంతో ఎగ్జిబిషన్ నిర్వాహకుడు వెళ్లి ఆయనను కలవగా.. 'అన్న'ను ఓసారి కలవాలని సీఐ చెప్పడంతో హతాశులయ్యారు.

మాజీ ఎమ్మెల్యే వద్దకు పంచాయితీ..

ప్రజాప్రతినిధి వ్యవహారాన్ని ఎగ్జిబిషన్ నిర్వాహకుడు నగర టీడీపీలో మరో వర్గానికి ప్రతినిధిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఫోర్త్ టౌన్ సీఐకి ఫోన్ చేసి గట్టిగా మాట్లాడినట్లు తెలిసింది. వ్యవహారం చినికి చినికి గాలివానలా తయారయ్యేలా ఉందని గుర్తించిన సీఐ వెంటనే అనుమతులిచ్చేసినట్లు తెలిసింది. ఈ విషయం ప్రజాప్రతినిధి దృష్టికి కూడా సీఐ తీసుకెళ్లారు. మాజీ ఎమ్మెల్యే ఈ వ్యవహారాన్ని మీడియా ముందుకు తీసుకెళతారనే ఉద్దేశంతో ప్రజాప్రతినిధి వెనక్కు తగ్గినట్టు తెలిసింది.



అనంతపురంలో ఇలా రోడ్డు పక్కన వాహనం నిలుపుకోవాలన్నా కప్పం కట్టాల్సిందేనట!

వాహనాల స్టాండ్‌కూ సుంకమే!

అనంతపురం ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న స్థలంలో నిత్యం పలు 407 అద్దె వాహనాలు నిలబడి ఉంటాయి. అయితే అక్కడ ఇకపై వాహనాలు నిలుపుకోవాలంటే ఒక్కో వాహనదారుడు నెలానెలా తనకు రూ.2 వేలు సమర్పించుకోవాలంటూ ప్రజాప్రతినిధి నుంచి ఆదేశాలు వచ్చాయని బాధితులు చెబుతున్నారు. ప్రతి ఏటా క్రాఫ్ట్ ఎగ్జిబిషన్లు, ఇతర రాష్ట్రాల నుంచి కాటన్ వస్త్రాల వ్యాపారులు వచ్చి ఎగ్జిబిషన్లు పెడుతుంటారు. తాజాగా గుత్తి రోడ్డులో ఓ ఎగ్జిబిషన్ నడుస్తోంది. వీటన్నిటి నుంచి కూడా మామూళ్లు వసూలు చేసినట్టు తెలుస్తోంది. సదరు ప్రజాప్రతినిధి దెబ్బకు చిన్న వ్యాపారుల నుంచి పెద్ద పెట్టుబడిదారుల వరకూ హడలిపోతున్నారు. కూటమి పాలన అంటే ఇదేనా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాకు 24న ప్రాథమిక విద్య కమిషనర్ రాక



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు ఈనెల 24న జిల్లాలో పర్యటించనున్నారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న పంచాయతీ మోడల్ ప్రైమరీ పాఠశాలల విధానంపై సమీక్షించనున్నారు. జీఎస్‌టీయూ ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం స్థానిక పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ అంధ విద్యార్థుల పాఠశాలలోని ఆడిటోరియంలో ఉమ్మడి జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాశాఖ అధికారులు ప్రసాద్‌బాబు, కిష్టప్ప, సమగ్ర శిక్ష ఏపీసీలు శైలజ, దేవరాజు, డీసీఈబీ కార్యదర్శులు గంధం శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి, డీవైఈఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓలు మాట్లాడుతూ కమిషనర్ నిర్వహించే సమీక్షకు అన్ని వివరాలతో హాజరుకావాలని ఆదేశించారు. ముఖ్యంగా పంచాయతీ మోడల్ ప్రైమరీ పాఠశాలలకు సంబంధించి అన్ని వివరాలు ఉండాలన్నారు. పూర్తిగా అవగాహన కల్గి ఉండాలని సూచించారు. కమిషనర్ ర్యాండమ్‌గా స్కూళ్ల గురించి ఆరా తీస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలోని డీవైఈఓలు, ఎంఈఓలు, మోడల్ ప్రైమరీ పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్టీలు తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు.

యువతలో నైపుణ్యాన్ని పెంపొందించాలి

- విస్తృతంగా అవగాహన కల్పించాలి
- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, హాజరైన అధికారులు

అనంతపురం అర్బన్: 'యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించడం ద్వారానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు. దీన్ని దృష్టిలో ఉంచుకుని 'సంకల్ప', 'పీఎం విశ్వకర్మ' పథకాల కింద విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా నైపుణ్య కమిటీ (డీఎస్‌సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో నైపుణ్యాభివృద్ధికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'సంకల్ప' ద్వారా యువతకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్రాల సంఖ్య పెంచాలని చెప్పారు. శిక్షణ తరువాత ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు. మెరుగైన సమాచారం కోసం డీఎస్‌సీ (డిస్ట్రిక్ట్ స్కిల్ కమిటీ) సభ్యులు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆటోమోటివ్, మైనింగ్ రంగాల కోసం సమగ్ర శిక్షణ కోర్సులను నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీధర్, గిరిజన సంక్షేమ శాఖాధికారి రామాంజనేయులు, ఇతర అధికారులు, పాలిటెక్నిక్, ఐటీఐ ప్రిన్సిపాళ్లు, ఆర్‌డీటీ, కియా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే లక్ష్యంగా రుణం..

రైతుల ఆర్థిక శ్రేయస్సే లక్ష్యంగా పంట రుణ పరిమితి ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ సమావేశం నిర్వహించంఆరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని బ్యాంకుల ద్వారా ఖరీఫ్– 2025, రబీ..2025–26లో వివిధ పంటలకు సంబంధించి రుణ పరిమితిని నిర్ణయించామన్నారు. కార్యక్రమానికి ఏడీసీసీ బ్యాంక్ సీఈఓ సురేఖరాణి కన్వీనర్‌గా వ్యవహరించారు. సమావేశంలో ఎల్‌డీఎం నర్సింగరావు, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, సరికల్చర్, పశుసంవర్ధక శాఖ, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ సాయంతో నేరాల నియంత్రణ

- డీజీపీ ద్వారక తిరుమలరావు



మాట్లాడుతున్న డీజీపీ ద్వారక తిరుమలరావు

పుట్టపర్తి టౌన్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రాష్ట్ర వ్యాప్తంగా నేరాల నియంత్రణకు గట్టిగా కృషి చేస్తున్నట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) ద్వారక తిరుమలరావు తెలిపారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటిపై ప్రత్యేక ఆడియోలు, వీడియోలు, విద్యాసంస్థల్లో సదస్సులు, ర్యాలీల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి జిల్లాకూ ఒక సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించామన్నారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా పర్యటనలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఆయన స్థానిక ప్రశాంతినిలయంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డీఐజీ షిమోషీ, ఎస్పీ రత్నతో కలసి పోలీసు అధికారులతో సమీక్షించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని గంజాయి రహితంగా మారుస్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం వంద ఎకరాల్లో మాత్రమే గంజాయి సాగులో ఉందని, దాన్ని కూడా తొలగిస్తామని చెప్పారు. మానవ తప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాంగ్, ర్యాష్ డ్రైవింగ్ మానుకోవాలని, హెల్మెట్ తప్పక వాడాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో కఠినంగా ఉంటామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడమంటే లైసెన్స్ లేని తుపాకీతో విచక్షణ రహితంగా కాల్పులు జరపడంతో సమానమని అభిప్రాయపడ్డారు. ఇటీవల జిల్లా పోలీస్ అధికారులు విడుదల చేసిన శాంతభద్రతలు, నేర నివేదిక –2024 ప్రకారం జిల్లాలో అన్ని రకాల నేరాలు తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోందన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సంస్థ ఆదాయం పెంచండి

ఆర్టీసీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి.. ఖర్చులు తగ్గించుకుని, సంస్థ ఆదాయం పెంచాలని డీజీపీ, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు సూచించారు. ఆయన పుట్టపర్తి ఆర్టీసీ బస్సు డిపోను తనిఖీ చేశారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఉద్యోగులకు బకాయిలను ఈ నెలాఖరులోపు చెల్లిస్తామన్నారు.

సీరియస్ మీటింగ్.. సైలెంట్‌గా రమ్మీ!

- డీఆర్‌ఓ మలోల నిర్వాకం
- వివరణ కోరిన కలెక్టర్



ఎ.మలోల, జిల్లా రెవెన్యూ అధికారి

అనంతపురం అర్బన్: కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తరువాత రెవెన్యూ శాఖలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) పోస్టు అత్యంత కీలకమైనది. అలాంటి పోస్టులో ఉన్న అధికారి అందరికీ ఆదర్శంగా, జవాబుదారీగా ఉండాలి. అయితే జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మలోల వ్యవహరించిన తీరు ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. కీలకమైన సమావేశం జరుగుతున్న సమయంలో.. అదేమీ తనకు పట్టనట్లు బాధ్యతలు విస్మరించి తన మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్ రమ్మీ గేమ్ ఆడుతూ కెమెరాకు చిక్కారు. అది కాస్తా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. వివరాలు.. ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఈ నెల 20న అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు వినోద్‌కుమార్, టి.ఎస్.చేతన్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్సీ, ఇతర సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించారు. ఇదే సమయంలో వేదికపై ఉన్న డీఆర్‌ఓ మలోల అక్కడి వ్యవహారం తనకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తూ.. తన పక్కన ఉన్నతాధికారులు ఉన్నారనే కనీస ఆలోచన లేకుండా మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్ రమ్మీ ఆడారు. ఈ దృశ్యాన్ని కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో అదికాస్తా వైరల్‌గా మారింది.

వివరణ కోరిన కలెక్టర్

కీలక సమావేశం జరుగుతున్న సమయంలో డీఆర్‌ఓ మలోల ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తీవ్రంగా పరిగణించారు. డీఆర్‌ఓను వివరణ కోరినట్లు తెలిసింది. దీంతో డీఆర్‌ఓ మలోల స్వయంగా కలెక్టర్ బంగ్లాకు వెళ్లి కలెక్టర్‌కు వివరణ ఇచ్చినట్లు సమాచారం.

గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు

అనంతపురం: మద్యం పాలసీలో భాగంగా గీత కార్మికులకు మద్యం విక్రయ దుకాణాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాటి తాగు సంప్రదాయ వృత్తిలో కొనసాగుతున్న బీసీ–ఏ కేటగిరిలోని యాట ఉపకులం, బీసీ–బీ కేటగిరిలోని గౌడ్, ఈడిగ, గాండ్ల (గమ్మల), కలాలే, గౌండ్ల, శ్రీశయన (సేగిడి) వారు అర్హులుగా పేర్కొన్నారు. జిల్లాలో ప్రత్యేకించి బీసీ–బీ కేటగిరిలోని ఈ ఉప కులాలకు చెందిన వారికి మొత్తం 14 మద్యం షాపులు కేటాయించారు. ఇందులో గౌడ్–2, ఈడిగ–9, గౌడ–1, కలాలే–1, గౌండ్ల–1 చొప్పున దుకాణాలు కేటాయించగా... అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి గౌడ్–1, ఈడిగ–7, గౌడ–1 చొప్పున మొత్తం 9 మద్యం దుకాణాలను కేటాయించారు. 2026 సెప్టెంబర్ 30వ తేదీ వరకూ వీరికి మద్యం విక్రయ లైసెన్స్‌లు జారీ చేస్తారు. ఒకరికి ఒక లైసెన్స్ మాత్రమే ఇస్తారు. దుకాణాల వార్షిక లైసెన్స్ ఫీజు సాధారణ దుకాణాలతో పోల్చుకుంటే 50 శాతం తక్కువగా ఉంటుంది. ఇందుకు సంబంధించి ఈ నెల 27న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి, ఫిబ్రవరి 5వ తేదీలోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లేదా హైబ్రిడ్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఫిబ్రవరి 7న జిల్లా కలెక్టర్ల సమక్షంలో లాటరీ పద్ధతిలో అర్హులను ఎంపిక చేస్తారు.

పట్టి 'పీడీ'స్తున్నాడు..

చెలరేగిపోతున్న ఫిజికల్ డైరెక్టర్

- డీఈఓ, సమగ్ర శిక్ష కార్యాలయాల్లో హల్‌చల్
- ఎంపీ, ఎమ్మెల్యే తెలుసంటూ ఉద్యోగులకు బెదిరింపులు
- తాను చెప్పిన టీచర్లనే తీసుకోవాలంటూ హెచ్చరికలు
- ఏఎస్‌ఓ పోస్టు భర్తీలోనూ మితిమీరిన జోక్యం
- హడలిపోతున్న విద్యాశాఖ అధికారులు

- "నేను ఇంతకుముందే చెప్పాను కదా. ఈయన్నే డీఈఓ ఆఫీస్‌లో ఏఎస్‌ఓగా తీసుకోవాలని! మరి ఎందుకు ఆలస్యం చేస్తున్నారు? మీకేమైనా ఆర్జేడీ నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయా? చెప్పండి. నేను చూసుకుంటా. అవసరమైతే ఆర్జేడీకి విద్యాశాఖ మంత్రి లోకేష్‌తోనే ఫోన్ చేయిస్తా.''
- "ఏం నేను ఫోన్ చేస్తే తీయవా... ఏమనుకుంటున్నావ్? ఒకవేళ మీటింగ్‌లో ఉంటే మళ్లీ అయినా ఫోన్ చేయాలని తెలీదా! తమాషాలు చేస్తున్నావా? నేననుకుంటే అరగంట కూడా ఇక్కడ పని చేయలేవు జాగ్రత్త. అందరిలా నన్ను అనుకోవద్దు''

..... విద్యాశాఖ, సమగ్రశిక్ష ఉద్యోగులకు ఓ సాధారణ ఫిజికల్ డైరెక్టర్ చేసిన బెదిరింపులివీ. ఈయన వైఖరి ఇప్పుడు విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది.



అనంతపురం ఎడ్యుకేషన్: స్కూల్‌లో పిల్లలకు వ్యాయామ విద్యను బోధించాల్సిన ఓ పీడీ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చెలరేగిపోతున్నాడు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులకు మించి విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు, ఉద్యోగులను శాసిస్తున్నాడు. ఇటీవల డీఈఓ కార్యాలయంలోని ఏఎస్‌ఓ పోస్టుకు తాను చెప్పిన టీచరును తీసుకోవాలంటూ తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు చేస్తుండటంతో అధికారులు కూడా వణికిపోతున్నారు. కాగా, సదరు టీచరు గతంలో ఏఎస్‌ఓగా పని చేశాడు. అప్పట్లో ఆయనపై పెద్ద ఎత్తున అవినీతి, ఆరోపణలు రావడంతో తప్పించి బడికి పంపారు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ ఆ టీచర్ తెరపైకి రాగా.. అతనికి మద్దతుగా పీడీ రంగంలోకి దిగాడు. టీచరును ఆ పోస్టులోకి తీసుకోవాలంటూ విద్యాశాఖ అధికారులపై తీవ్రస్థాయిలో బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

వారెవరూ కనిపించరాదట..!

ఈనెల 24న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు జిల్లాలో పర్యటించనున్నారు. ఏర్పాట్లు, వసతి, రవాణా తదితర పనులను పర్యవేక్షించేందుకు డీఈఓ తన సిబ్బందితో మాట్లాడి కొందరు టీచర్లను స్పెషల్ డ్యూటీకింద వేశారు. వారంతా కమిషనర్ పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాల్సి ఉంటుంది. అయితే, సోమవారం డీఈఓ కార్యాలయానికి వెళ్లిన పీడీ... డ్యూటీలకు వేసిన వారి జాబితాను తీసుకుని కొందరి పేర్లు ప్రస్తావిస్తూ వీరిని ఎలా డ్యూటీకి వేస్తారంటూ ఉద్యోగులపై అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. వీరెవరూ కమిషనర్ పర్యటనలో కనిపించకూడదంటూ స్వయంగా డీఈఓ సమక్షంలోనే హెచ్చరికలు జారీ చేశాడని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంపీ, ఎమ్మెల్యే పేరు చెప్పుకుంటూ..

తన సామాజికవర్గానికి చెందిన ఎంపీ, జిల్లాలోని ఓ ఎమ్మెల్యే పేరు చెప్పుకుంటూ పీడీ బెదిరింపులకు గురిచేస్తున్నాడు. తాను వారితో సన్నిహితంగా ఉంటానని, విద్యాశాఖలో ఏ చిన్న పని ఉన్నా ఎంపీ, ఎమ్మెల్యే తనతో చర్చించే నిర్ణయం తీసుకుంటారంటూ చెబుతున్నట్లు తెలిసింది. తాను చెబితే ఎంపీ, ఎమ్మెల్యే చెప్పినట్టేనంటూ బెదిరిస్తున్నట్లు ఉద్యోగులు వాపోతున్నారు. టీడీపీ సానుభూతిపరులుగా ఉంటూ పార్టీ కోసం పని చేసిన టీచర్లు సైతం ఈయన దెబ్బకు బెదిరిపోతున్నారు. ఇలాంటివారి వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందంటూ చెబుతుండడం విశేషం.

క్లుప్తంగా

క్రైస్తవులంటే చంద్రబాబు, పవన్‌కు చిన్నచూపు


మాట్లాడుతున్న వైవీ బాబు, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: క్రైస్తవులంటే సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కు చిన్న చూపని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు వైవీ బాబు విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్చకులు, మౌజాన్లు, ఇమాంలు, పాస్టర్లకు అందజేసిన గౌరవవేతనాన్ని కొనసాగించకుండా అన్యాయం చేయడమే ఇందుకు నిదర్శనమని మండిపడ్డారు. బిషప్ వాసు అనిల్‌కాంత్, పాస్టర్లు జాకోబు, అరోహన్, అబ్రహాం, సాల్మోన్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ నేత చిలకల థామస్‌తో కలసి జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం అందజేసినట్లుగానే పాస్టర్లకు రూ.5 వేల గౌరవవేతనాన్ని అందజేయాలని కోరారు. గౌరవ వేతనం జాప్యంతో జిల్లాలోని 233 పాస్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జెరూసలేం యాత్రకు, విదేశీ విద్య, పెళ్లికానుకనూ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అందరినీ సమానంగా చూడాలన్నారు.

గూడ్స్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

అనంతపురం సిటీ/గార్లదిన్నె : గూడ్స్ రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నెకు బి.నారాయణ (72) తనకున్న పొలంలో చీనీ సాగు చేపట్టాడు. ఈ క్రమంలో మంగళవారం కాలినడకన చీనీ తోటకు బయలుదేరిన ఆయన మార్గమధ్యంలో గూడ్స్ రైలు వస్తున్న విషయాన్ని గమనించకుండా పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో గూడ్స్ రైలు ఢీకొనడంతో ఎగిరి సుదూరంగా పొదల మధ్య పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గూడ్స్ లోకో పైలెట్ నుంచి సమాచారం అందుకున్న ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ మహమ్మద్ రఫీ, అనంతపురం జీఆర్‌పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

స్టడీపై ఉదాసీనత

పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచే చర్యలకు కూటమి సర్కార్ తిలోదకాలిచ్చింది. మరో మూడు నెలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు సన్నాహకాలు చేస్తున్న ప్రభుత్వం ఇప్పటి వరకూ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందివ్వకపోవడమే ఇందుకు నిదర్శనం. ఇప్పటికే జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్టడీ మెటీరియల్ కావాలంటూ ప్రభుత్వానికి జిల్లా విద్యాశాఖాధికారులు నివేదికలు అందజేశారు. అయినా స్టడీ మెటీరియల్‌పై ఇప్పటికీ స్పష్టత లేదు.



- 2022లో రాష్ట్రంలో మొట్టమొదటి సారి స్టడీ మెరిటీయల్ అందజేసిన అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- రెండేళ్ల పాటు క్రమం తప్పకుండా పంపిణీతో మెరుగైన ఫలితాలు
- కూటమి సర్కార్ ఏర్పాటైన తర్వాత అందని స్టడీ మెటీరియల్
- ప్రతిపాదనలకే పరిమితమైన వైనం

తాడిపత్రి రూరల్: పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో రూ.లక్షల వ్యయంతో నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను 2022లో తొలి సారి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఉచితంగా పంపిణీ చేసింది. ఇలా రెండేళ్ల పాటు క్రమం తప్పకుండా స్టడీ మెటీరియల్ అందజేయడంతో ఫలితాలు ఆశించిన మేర దక్కాయి. పలు కారణాలతో సిలబస్ పూర్తి కాకపోయినా ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా స్టడీ మెటీరియల్ సాయంతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత స్టడీ మెటీరియల్ పంపిణీపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఫలితంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 32,803 మందితో పాటు ప్రైవేట్ విద్యాసంస్థల్లోని 11,968 మంది విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతోంది.

సాఫ్ట్ కాపీతో సర్దుబాటు

పదో తరగతి విద్యార్థుల కోసం ఈ ఏడాది స్టడీ మెటీరియల్ పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోగా, విద్యాశాఖాధికారులకు ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన సాఫ్ట్ కాపీలను అందజేసింది. వీటిని ఆయా హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు వాట్సాప్ ద్వారా విద్యాశాఖాధికారులు చేరవేశారు. ఒక్కో సబ్జెక్టుకు సంబంధించి 40 పేజీలు చొప్పున ఆరు సబ్జెక్టులకు మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయులు ప్రింట్ తీశారు. ఇందుకు అయ్యే ఖర్చును పాఠశాల నిధుల నుంచి ఖర్చు చేసినట్లు సమాచారం. కొన్ని పాఠశాలల్లో రూ.100 చొప్పున విద్యార్థుల నుంచి వసూలు చేసినట్లు ఆరోపణలూ ఉన్నాయి.

ఎదురు చూస్తున్నాం



స్టడీ మెటీరియల్ కోసం ఎదురు చూస్తున్నాం. తాత్కాలికంగా ఉపాధ్యాయులు మెటీరియల్ ఇచ్చారు కానీ, నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. స్టడీ మెటీరియల్‌లో పరీక్షల కోసం వచ్చే ఇంపార్టెంట్ ప్రశ్నలు ఎక్కువగా ఉంటాయని, వాటిని చదివితే సులువుగా పాసు కావచ్చుననే నమ్మకంతో ఉన్నా.

– రాంచరణ్, విద్యార్థి, చుక్కలూరు జెడ్పీహెచ్ఎస్

ఉపాధ్యాయులే ప్రశ్నలు ఇస్తున్నారు



స్టడీ మెటీరియల్ వస్తుందో రాదో కూడా తెలియడం లేదు. దీంతో ఉపాధ్యాయులే ఇంపార్టెంట్ ప్రశ్నలను తయారు చేసి ఇస్తున్నారు. గతంలో పబ్లిక్ పరీక్షలకు వచ్చిన వాటిని ఫిల్టర్ చేసి ప్రశ్నలను తయారు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో జరిగే స్టడీ అవర్స్‌లో టీచర్లు ఇచ్చిన ఇంపార్టెంట్ ప్రశ్నలను చదవాల్సి వస్తోంది.

– రాజకుళ్లాయప్ప, టెన్త్ విద్యార్థి, చుక్కలూరు జెడ్పీహెచ్ఎస్

ఎలాంటి ఉత్తర్వులూ రాలేదు



10వ తరగతి విద్యార్థుల స్టడీ మెటీరియల్ పంపిణీ చేయలేదు. ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ప్రస్తుతం ఎస్‌సీఈఆర్‌టీ సాఫ్ట్ కాపీనే అందజేశాం. వీటి ఆధారంగా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం.

– ప్రసాద్‌బాబు, డీఈఓ

అతిగా మద్యం తాగి యువకుడి మృతి


మృతుడు శంకర్

ఉరవకొండ: తక్కువ ధరకు అందుబాటులో ఉన్న మద్యం అతిగా తాగి ఓ యువకుడు మృతి చెందాడు. ఫలితంగా ఆ కుటుంబం రోడ్డు పాలైంది. వివరాలు... ఉరవకొండలోని 5వ వార్డులో నివాసముంటున్న కురుబ శంకర్ (35)కు భార్య చంద్రకళ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకునే శంకర్... గత ఆరు నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం అతిగా మద్యం సేవించి నరసమ్మ మఠం సమీపంలో కుప్పకూలిపోయాడు. గమనించిన పరిచయస్తులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనతో భార్యాపిల్లల రోదనలు మిన్నంటాయి.

రైతు ఆత్మహత్య


చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

పెద్దపప్పూరు: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... పెద్దపప్పూరు మండలం చెర్లోపల్లికి చెందిన నారాయణరెడ్డి, నాగేంద్రమ్మ దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు కుమ్మెత చంద్రశేఖరరెడ్డి (40) ఉన్నారు. తనకున్న పొలంలో మిరప, వంగ తదితర పంటలు సాగు చేశాడు. పంటల సాగుకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. ఈ క్రమంలో తెగుళ్ల బెడదతో పాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభ్యం కాక నష్టపోయాడు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదంటూ బంధుమిత్రులతో చెప్పుకుని బాధపడేవాడు. అప్పులు తీర్చకపోతే గ్రామంలో పరువు పోతుందని భయపడిన చంద్రశేఖరరెడ్డి మంగళవారం విషపు గుళికలు మింగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆయనను గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పెద్దపప్పూరులోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు 108 అంబులెన్స్‌లో తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఆయన భార్య రాదిక, ఇంటర్ చదువుతున్న కుమారుడు జితేంద్రరెడ్డి ఉన్నారు. ఘటనపై ఎఎస్ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

యల్లనూరు: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరు మండలం దుగ్గుపల్లికి చెందిన ఉలవల కిరణ్ (21) ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం గొడ్డుమర్రికి చెందిన శివ ఇంట్లో వైరింగ్ పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే సమీపంలోని పులివెందులలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి బలవన్మరణం


విశ్వనాథరెడ్డి

తాడిపత్రి రూరల్: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం తక్కళ్లపల్లికి చెందిన విశ్వనాథరెడ్డి (62) కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గతంలో శస్త్రచికిత్స కూడా చేయించుకున్నా ఫలితం దక్కలేదు. నొప్పి తీవ్రత తాళలేని ఆయన మంగళవారం తాడిపత్రి సమీపంలోని పుట్లూరు మార్గంలో ఉన్న రైల్వే గేట్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పీఎస్ ఎస్ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య నాగేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

దళారుల చేతుల్లో కంది రైతులు దగా : ఏఐకేఎస్

అనంతపురం అర్బన్: కంది పంట సాగు చేసిన రైతులను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని... దీనిని ఆసరాగా చేసుకుని దళారులు కుమ్మక్కై రైతులను దగా చేస్తున్నారని రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు నెలల క్రితం క్వింటా కందులను రూ.10వేలతో కొనుగోలు చేసిన దళారులు.. ప్రస్తుతం ప్రభుత్వ వైఖరి కారణంగా క్వింటా రూ.6 వేలు, రూ.6,500 మించి కొనడం లేదన్నారు. ఈ నెల 25వ తేదీ లోపు కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ.7.550 మద్దతు ధరతో పాటు బోనస్ కింద రూ.2 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అల్లనేరేడు చెట్ల నరికివేత

- వైఎస్సార్‌సీపీ కార్యకర్త పొలంలో విధ్వంసం


బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో కనుమరుగైపోయిన ఆస్తుల విధ్వంసం... కూటమి సర్కార్ ఏర్పాటైన తర్వాత మళ్లీ జడలు విప్పుకుంది. అధికారంలోకి వచ్చామన్న అహంకారంతో గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. ఈ క్రమంలోనే రాప్తాడు నియోజకవర్గంలో మాజీ మంత్రి పరిటాల సునీత పేరు చెప్పి మరీ దాడులకు తెగబడుతున్నారు. తాజాగా మండలంలోని పుల్లలరేవు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పెద్ద ఓబులేసుకు చెందిన 61 అల్ల నేరేడు చెట్లను టీడీపీ నాయకులు నరికి వేశారు. బాధిత రైతు తెలిపిన మేరకు.... సర్వే నంబర్ 88–3 (న్యూ)లో తనకున్న 2.86 ఎకరాల పొలంలో రైతు ఓబులేసు రెండేళ్ల క్రితం 200 అల్లనేరెడు మొక్కలను నాటాడు. ఈ నెల 17న 15 చెట్లు, తాజాగా సోమవారం రాత్రి 40 చెట్లను నరికి వేశారు. రాజకీయ కక్షతో స్థానిక టీడీపీ నాయకులు తలారి విజయ్, అశోక్ కుమార్, చంద్రమోహన్, నరేంద్ర, నారాయణ స్వామి, సాయినాథనాయుడు, అక్కులన్న, గురుప్రసాద్, క్రిష్ణయ్య, చెన్నారెడ్డి ఈ ఘాతుకానికి తెగబడినట్లు పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు చేశాడు.

అండగా ఉంటాం

అధైర్య పడోద్దు... అండగా ఉంటామని బాధిత రైతు ఓబులేసు, ఆయన కుటుంబసభ్యులకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసానిచ్చారు. మంగళవారం ఆయన పెద్ద ఓబులేసు పొలంలో నరికి వేసిన అల్లనేరేడు చెట్లను పరిశీలించారు. ఘటనపై ఓబులేసు, ఆయన భార్య యశోదమ్మతో ఆరా తీశారు. నరికివేసిన మొక్కల స్థానంలో కొత్తగా మొక్కలు నాటుకునేందుకు ఆర్థిక సాయం చేస్తానన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గంలో టీడీపీ నాయకుల ఆగడాలు ఎక్కువయ్యాయన్నారు. తాడిపత్రి, యల్లనూరు ప్రాంతాలకు పరిమితమైన చెట్ల నరికివేత సంస్కృతిని స్థానిక టీడీపీ నాయకులు ఇక్కడకు తీసుకురావడం బాధాకరమన్నారు. కలెక్టర్, ఎస్పీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చొరవ తీసుకుంటానన్నారు.

విజయవాడకు ఐదుగురు సీడీపీఓలు

- మాతాశిశు సంరక్షణలో వెనుకడినట్లు గుర్తింపు

అనంతపురం సెంట్రల్: జిల్లాలో ఐదు ప్రాజెక్టుల పరిధిలో చిన్నారుల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులు గుర్తించారు. ఉరవకొండ, శింగనమల, అనంతపురం రూరల్, గుత్తి, కణేకల్లు ప్రాజెక్టుల్లో చిన్నారుల పరిస్థితి బాగోలేదని తేలింది. ఈ క్రమంలో సంబంధిత సీడీపీఓలు శ్రీదేవి, ఉమాశంకరమ్మ, ధనలక్ష్మి, లక్ష్మీ ప్రసన్న, ఢిల్లీశ్వరి విజయవాడకు రావాలని ఐసీడీఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో హుటాహుటిన సంబంధిత సీడీపీఓలు, వారి సిబ్బంది బయలుదేరి వెళ్లారు.

రూ. కోట్లు వెచ్చిస్తున్నా వెనుకబాటే.. : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాతా శిశువుల సంరక్షణ కోసం రూ. కోట్ల నిధులు వెచ్చిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. అయితే ఫలితాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. గతేడాది జిల్లావ్యాప్తంగా చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు. ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ ఎత్తు ఉన్నారా లేదా అనే వివరాలు సేకరించారు. ఈ విషయంలో ఆయా ప్రాజెక్టులు వెనుకబడినట్లు గుర్తించారని, దీంతోనే విజయవాడకు రావాలని ఆదేశాలు వచ్చాయని తెలిసింది.

అవార్డులు అందుకున్నా అంతే! : 'ఉత్తమ' అవార్డులు అందుకున్న రెండు ప్రాజెక్టుల సీడీపీఓలకు ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి ఆదేశాలు అందడం తీవ్ర చర్చనీయాంశమైంది. మెరుగైన పనితీరు కనబరిచారంటూ ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవి, గుత్తి సీడీపీఓ ఢిల్లీశ్వరికి గతంలో అవార్డులు అందజేశారు. అలాంటి వారే ఇప్పుడు ముందువరసలో ఉండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టు ప్రగతి పథంలో నడిపిస్తున్నట్లు కేవలం కాగితాల్లో చూపి అవార్డులు అందుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

అశ్రునయనాలతో అంత్యక్రియలు


అంతిమ యాత్రలో పాల్గొన్న కుటుంబ సభ్యులు, యంగ్ ఇండియా మాజీ ఉద్యోగులు

పెనుకొండ రూరల్: సామాజిక ఉద్యమకారుడు నరేంద్ర సింగ్ బేడీ అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాల మధ్య సాగాయి. పెనుకొండ మండలం గుట్టూరు రెవెన్యూ పరిధిలో నరేంద్రసింగ్ బేడీ ఎంతో ఇష్టంగా ఏర్పాటు చేసుకున్న యంగ్ ఇండియా ఫామ్ హౌస్‌లో కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాలకు చెందిన స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. కాగా, 1975–76లో గుట్టూరు కేంద్రంలో యంగ్ ఇండియా ప్రాజెక్ట్‌ను బేడీ ప్రారంభించారు. అనంతరం సేవాకార్యక్రమాలను ఉమ్మడి అనంతపురం జిల్లాకు మాత్రమే పరిమితం చేయకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 13 జిల్లాలకు విస్తరించారు. గ్రామీణులకు ఉపాధి, భూహక్కు చట్టాలపై పోరాటాలు సాగించిన సామాజిక ఉద్యమకారుడిగా ఆయన ఖ్యాతిగడించారు. కాగా, సోమవారం ఆయన మృతి తెలుసుకున్న మంత్రి సవిత, మడకశిర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సుధాకర్... యంగ్ ఇండియా ఫామ్ హౌస్‌కు చేరుకుని నరేంద్రసింగ్ బేడీ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం బేడీ నివాసానికి వైఎస్సార్ సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర చేరుకుని నివాళులర్పించారు. ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛోఫెర్రర్, ఆయన తల్లి అన్నే ఫెర్రర్, డైరెక్టర్ మల్లారెడ్డి, టింబక్టు డైరెక్టర్ బబ్లూ, మేరీ, యంగ్ ఇండియా మాజీ ఉద్యోగులు, నల్గొండ ఆచార్య, ప్రసాద్, ప్రమీల, రామగిరి మండలం రామప్ప, గార్లదిన్నె రవి, కిష్టప్ప, బాలరాజు, వాసు, ధర్మవరం కిష్టప్ప, గుట్టూరు సూర్యనారాయణ, మంజునాథ్, కొండారెడ్డి, ద్వాక్రా రామాంజనేయులు, కోగిర జయచంద్ర, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రాజేష్



అనంతపురం టవర్‌క్లాక్: బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఉరవకొండ ప్రాంతానికి చెందిన కొనకొండ్ల రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం అనంతపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో రాణించిన స్టీఫెన్


ఫైనల్ మ్యాచ్‌లో తలపడిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్

అనంతపురం: నేషనల్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్–2025 అండర్–13 ఓపెన్ విభాగంలో నిర్వహించిన చెస్ పోటీల్లో అనంతపురానికి చెందిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ రాణించాడు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు పోటీలు జరిగాయి. దేశ వ్యాప్తంగా 1,200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. స్విస్ లీగ్ పద్ధతిలో జరిగిన పోటీల్లో తలపడిన స్టీఫెన్.. మొత్తం 9 రౌండ్లకు గాను 8 పాయింట్లు (7 గెలుపు, 2 డ్రా) సాధించి చాంపియన్‌షిప్ టైటిల్ దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా స్టీఫెన్‌ను ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఉదయ్‌కుమార్‌నాయుడు, అనంతపురం చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ అభినందించారు.

సమగ్ర గడప దాటని నిధులు

- కేజీబీవీల్లో లైబ్రరీ, ల్యాబ్, కంప్యూటర్, ఆర్ట్–క్రాఫ్ట్ తరగతి గదుల నిర్మాణాలు
- ఒక్కో గదికి రూ.20 లక్షల కేటాయింపు
- ఎస్‌ఎంసీల తీర్మానాల మేరకు చేపట్టిన నిర్మాణ పనులు
- 25 శాతం అడ్వాన్స్ ఎస్‌ఎంసీ ఖాతాలకు పంపని వైనం


కుందుర్పి కేజీబీవీలో శ్లాబ్ వేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష అధికారుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనుల నిధులు ఆ కార్యాలయ గడప దాటడం లేదు. నిర్మాణాలకు సంబంధించిన నిధులు ఎస్‌ఎంసీ ఖాతాల్లోకి జమ చేయచేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. నెలలు తరబడి పేరుకుపోయిన బిల్లులకు సంబంధించిన ఫైలు ఇప్పటి వరకూ కలెక్టర్ వద్దకు చేరలేదంటే నిర్లక్ష్యం ఎంత మేర ఉందో అర్థం చేసుకోవచ్చు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆనివల్ వర్క్ ప్లాన్ (ఏడబ్ల్యూపీ) కింద జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) లైబ్రరీ, ల్యాబ్, కంప్యూటర్, ఆర్ట్–క్రాఫ్ట్ తరగతి గదుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఒక్కో గదికి రూ. 20 లక్షలు చొప్పున నిధులు కేటాయించారు. జిల్లాలో మొత్తం 26 గదుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎస్‌ఎంసీ తీర్మానాల మేరకు పనులను కాంట్రాక్టర్లు చేపట్టారు.

గత అక్టోబరులో బడ్జెట్ రిలీజ్

తరగతి గదుల నిర్మాణాలకు సంబంధించి 25 శాతం బడ్జెట్‌ను గత ఏడాది అక్టోబర్‌లోనే అప్పటి జగన్ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ క్రమంలో జిల్లాకు దాదాపు రూ. 2 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ బడ్జెట్‌ను కలెక్టర్ అనుమతులు తీసుకుని ఎస్‌ఎంసీ ఖాతాలకు బదిలీ చేయాల్సి ఉంది. 'వాల్యూ ఆఫ్ వర్క్ డన్' ఆధారంగా ఇంజినీరింగ్ అధికారులు నిర్ధారించిన తర్వాత బిల్లుల చెల్లింపునకు ఎస్‌ఎంసీ సభ్యులు అనుమతిలిస్తారు. అయితే ఇందులో ఏ ఒక్క ప్రక్రియనూ సమగ్ర శిక్ష అధికారులు పూర్తి చేయలేకపోయారు. ఇప్పటి వరకూ కలెక్టర్ కనీసం ఫైలు కూడా పెట్టలేదు. మరో వైపు పనులు చేసిన కాంట్రాక్టర్లు పార్ట్ బిల్లుల కోసం ఎస్‌ఎంసీలు, సమగ్రశిక్ష కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

ఈఈ 'ద్యూయల్ రోల్'తో తంటాలు

జిల్లా సమగ్రశిక్ష ఈఈగా కొనసాగుతున్న శంకరయ్య వాస్తవానికి శ్రీ సత్యసాయి జిల్లా సమగ్రశిక్ష రెగ్యులర్ ఈఈగా ఉన్నారు. రెండు జిల్లాలను సమన్వయం చేసుకోవడంలో విభాగాధిపతి విఫలమవుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఆయన రెగ్యులర్‌గా ఉన్న శ్రీ సత్యసాయి జిల్లాలో మాత్రం ఇప్పటికే అక్కడి కలెక్టర్ ఆమోదంతో 25 శాతం నిధులను ఎస్‌ఎంసీ ఖాతాల్లో జమ చేశారు. అనంతపురం జిల్లాలో మాత్రం ఇప్పటి వరకూ ఆ దిశగా ఆయన ఫైలు కదపలేకపోయారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

బయట జిల్లాల్లో పని చేస్తూ ఇక్కడ హెచ్ఓడీ ఇన్‌చార్జ్‌లుగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదంటూ సుమారు నాలుగు నెలల క్రితం జరిగిన జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ నిబంధన సమగ్రశిక్షలో బేఖాతరవుతోంది. ఇప్పటికీ ఈఈ ఇన్‌చార్జ్‌గా శ్రీసత్యసాయి జిల్లా అధికారే వ్యవహరిస్తున్నారు. రెండు జిల్లాల్లో పని చేస్తుండడం వల్ల ఆయన ఎక్కడా అందుబాటులో ఉండడం లేదని ఉద్యోగులు, ఎంఈఓలు, హెచ్ఎంలు వాపోతున్నారు.

కొసమెరుపు

ఎస్‌ఎంసీ ఖాతాల్లో జమ చేయాల్సిన నిధుల అంశంపై ఈఈ శంకరయ్యను వివరణ కోరగా...13 రోజుల కిందటే ఏపీసీ (ప్రస్తుత డీఈఓ)కు ఫైలు పెట్టానని చెప్పారు. డీఈఓను వివరణ కోరగా...తనకు ఫిజికల్‌గా ఎలాంటి ఫైలు అందలేదని పేర్కొన్నారు.

క్లుప్తంగా

24న కోటి కుంకుమార్చన

అనంతపురం కల్చరల్: హరిహర లలితా పరమేశ్వరి, సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో ఈనెల 24న ఉదయం 8:30 గంటలకు లలితా పరమేశ్వరీ చతుర్థ వర్ష కోటి కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ మహిళా మండలి నిర్వాహకులు తెలిపారు. మంగళవారం కోటి కుంకుమార్చనకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక కల్యాణం, సమస్త ప్రజానీకం అభివృద్ధి కోసం ఏటా అమ్మవారికి కోటి కుంకుమార్చన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇదే ఆనవాయితీని కొనసాగిస్తూ ఈసారి మరింత ఘనంగా కోటి కుంకుమార్చన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు తాళ్లపల్లి శ్రీదేవి, అమరావతి స్రవంతి, సాయిగీత పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజన ఖాతాలపై స్పెషల్ డ్రైవ్

అనంతపురం సిటీ: జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 24న జిల్లా వ్యాప్తంగా అన్ని పోస్టాఫీసుల్లో సుకన్య సమృద్ధి ఖాతాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు హెడ్ పోస్ట్‌మాస్టర్ భానుకుమార్ మంగళవారం తెలిపారు. పదేళ్లలోపు వయస్సు కలిగిన బాలికల పేరుతో ఖాతా తెరవచ్చని పేర్కొన్నారు. ఏడాదిలో కనీసం రూ.250 నుంచి గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు డిపాజిట్ చేసేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. బాలికకు 18 ఏళ్లు నిండిన తరువాత విద్య లేక వివాహం నిమిత్తం 50 శాతం నగదు ఉపసంహరించుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాతీయస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ



పతకాలు, ప్రశంసాపత్రాలను చూపుతున్న కేశవరెడ్డి స్కూల్ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు ఈనెల 19, 20 తేదీల్లో పంజాబ్‌లో జరిగిన జాతీయస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ చాటినట్లు ఆ పాఠశాల ఏజీఎం ఎరికల రెడ్డి తెలిపారు. మేఘవర్ష, రూపశ్రీ 'ఛఛఛ' అనే పాటకు స్వర్ణ పతకం, ఎం.ద్వారక్‌సాయి, రష్మితారేణు 'సాంబ' పాటకు, మహమ్మద్ 'ఛఛఛ' అనే పాటకు డ్యాన్స్ చేసి రజత పతకాలు, ఫోక్ డ్యాన్స్‌లో రోషన్ అనే విద్యార్థి కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఏజీఎంతో పాటు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

'చెత్త'శుద్ధి ఏదీ..?


విద్యుత్‌నగర్ నుంచి నాయక్‌నగర్‌కు వెళ్లే మార్గంలో పేరుకుపోయిన చెత్తా చెదారం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి బాధ్యతారాహిత్యంతో నగరంలో ఎక్కడ చూసినా చెత్త దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదు. దీని కారణంగా నగరంలోని విద్యుత్‌నగర్, నాయక్ నగర్, సాయి నగర్, మారుతీ నగర్, రాణి నగర్, పాతూరు, మున్నా నగర్, కమలా నగర్ తదితర ప్రాంతాల్లో చెత్త దిబ్బలు పేరుకుపోయాయి. నగరపాలక సంస్థ కమిషనర్‌గా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న కొనసాగుతున్నా.. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నగర వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేలుకుని తగు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

డీఆర్ఓపై చర్యలు తీసుకోవాలి


జేసీ శివనారాయణ శర్మతో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం అర్బన్: ఏకసభ్య కమిషన్ సమావేశం నిర్వహిస్తున్న సమయంలో డీఆర్ఓ మలోల ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడుతున్న వ్యవహారంపై విచారణ జరిపించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏకసభ్య కమిషన్ సమావేశం నిర్వహిస్తున్న సమయంలో ఎస్సీల వినతులు, సమస్యలపై డీఆర్ఓ శ్రద్ధ చూపలేదన్నారు. ఆన్‌లైన్ రమ్మీ ఆడటం బాధ్యతారాహిత్యమే అవుతుందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రామకృష్ణ, కేశవ, ఆది, తదితరులు పాల్గొన్నారు.

గుంతలు.. గగ్గోలు


నగరంలోని లలిత కళాపరిషత్ వద్ద గుంతల రహదారిలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ఓ కుటుంబం


అనంతపురం రాజు రోడ్డులో కంకర తేలిన దృశ్యం

• ఇదీ.. అనంత రహదారుల దుస్థితి

కూటమి ప్రభుత్వంలో అనంతపురం రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న సప్తగిరి సర్కిల్‌లో రోడ్లు గుంతలమయంగా మారాయి. ఎన్నిసార్లు రోడ్లకు మరమ్మత్తులు చేసినా.. కొన్ని రోజులకే అవి తేలిపోతున్నాయి. రూ.లక్షల ప్రజాధనంతో మరమ్మతులు చేస్తున్నా.. నాణ్యత కనిపించడం లేదు. నగరవాసులు ఈ గుంతల రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటించిన పాపాన పోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక నగరపాలక సంస్థ ఇంజినీర్లు గాఢ నిద్రలో ఉన్నారు. అభివృద్ధి పనులపై దృష్టి సారించడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


చెరువు కట్టపై అధ్వానంగా ఉన్న రహదారి


డ్రైనేజీని దాటుకుని వెళ్తున్న మహిళ

కుక్కల బెడదకు పరిష్కారం చూపరా..?


ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో ఏ డివిజన్‌లో పర్యటించినా.. కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని చాలాసార్లు చెప్పినా తేలిగ్గా తీసుకుంటున్నారు. పదే పదే చెప్పించుకోవద్దని ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తిపై మేయర్ వసీం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మేయర్ తన చాంబర్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో పారిశుధ్యం మెరుగు, కుక్కల నివారణ చర్యలు తీసుకోవడంలో ప్రజారోగ్యాధికారుల నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కుక్కలకు స్టెరిలైజేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. రూ.30 లక్షలతో లైట్లను కొనుగోలు చేసినా అవి ఎందుకు డివిజన్లలో ఏర్పాటు చేయలేదని ఇంజినీర్లను ప్రశ్నించారు. దీనిపై ఈఈలు రాధాకృష్ణ, షాకీర్‌లు నీళ్లు నమిలారు. నగరంలో ఇష్టానుసారంగా అనధికార నిర్మాణాలు జరుగుతున్నా.. టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. టౌన్ ప్లానింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని కమిషనర్ మల్లికార్జున రెడ్డికి సూచించారు. ఖాళీ పోస్టుల్లో నియామకాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలను తక్షణం అమలు చేయాలన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: కార్మికుల సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి విమర్శించారు. ఫిబ్రవరి 22 నుంచి 24 వరకు నిర్వహించనున్న ఏఐటీయూసీ జిల్లాస్థాయి కార్యశాలలో సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లాస్థాయి కార్యశాల కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత కల్పించకుండా అవుట్ సోర్సింగ్ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నాయన్నారు. కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించడం లేదని మండిపడ్డారు. సమస్యలపై కార్మికులను చైతన్య పరిచి చట్టాలు, జీఓలపై అవగాహన కల్పించేందుకు కార్యశాల నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు రాజు, ఎస్‌సీఎం బాషా, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

• దబాయింపు..!


బంకును తొలగించవద్దంటూ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న వెంకటేష్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై నగరానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి దురుసుగా ప్రవర్తించిన ఘటన ఆర్ట్స్ కళాశాల వద్ద చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం నగరపాలక సంస్థ టీపీఓ శిరీష, ప్లానింగ్ కార్యదర్శి మంజూష, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఆర్ట్స్ కళాశాల ముందున్న ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అక్కడికి వెంకటేష్ అనే వ్యక్తి చేరుకుని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని అడ్డుకున్నాడు. టౌన్ ప్లానింగ్ చైన్‌మన్ కుళ్లాయప్పపై వెంకటేష్ దౌర్జన్యం చేశాడు. అక్కడ జరుగుతున్న దౌర్జన్యాన్ని చిత్రీకరిస్తున్న సాక్షి ఫొటోగ్రాఫర్‌తో కూడా వెంకటేష్ దురుసుగా ప్రవర్తించాడు. కెమెరా లాక్కొనే ప్రయత్నం చేశాడు. అక్కడున్న వారు చివాట్లు పెట్టడంతో వెంకటేష్ వెనక్కి తగ్గాడు. కాసేపటికి అక్కడున్న కొన్ని ఆక్రమణలను మాత్రం టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. మిగతా వాటిని అలాగే వదిలేశారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

అనంతపురం: డాకు మహరాజు సినిమా విజయోత్సవ సభ నిర్వహించనున్న నేపథ్యంలో అనంతపురం నగరంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. సప్తగిరి సర్కిల్, వై జంక్షన్, తెలుగుతల్లి కూడలి మీదుగా ఇటు బెంగళూరు గానీ, అటు హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు రాంనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా కాకుండా క్లాక్ టవర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా వెళ్లాలని సూచించారు. మోస్ట్ ఇంపార్టెంట్ పర్సన్ పాస్ హోల్డర్లు , డాకు గ్యాలరీ పాస్ హోల్డర్లు శ్రీనగర్ 80 అడుగుల రోడ్డు మీదుగా విజయోత్సవ సభ వేదిక వద్దకు వెళ్లాలని తెలిపారు. పాసులు లేని వారిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి


డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న టీచర్ల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ), ఏపీ మోడల్ స్కూల్ ఎస్టీయూ నాయకులు కోరారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 2013 నుంచి ప్రిన్సిపాల్స్‌కు సంపాదిత సెలవులు మంజూరు చేయాలన్నారు. సర్వీస్ రిజిస్టర్లను అప్డేట్ చేయాలని కోరారు. ప్రొబేషన్ డిక్లరేషన్, రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పాత సీపీఎస్ అమౌంట్ టు డీటీఏకు జమ చేయాలని సూచించారు. జీతాలు, మెటర్నిటీ, మెడికల్, పాటర్నిటీ బిల్లులకు నాన్ డ్రాల్స్, పెండింగ్‌లో ఉన్న ఇతర బిల్లులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య, ఆర్థిక కార్యదర్శి సత్యనారాయణ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి కె.చంద్రశేఖర్, సతీశ్ వెంకటపతి, హనుమంత రాయుడు, ప్రసాద్, అఫ్రిన్ భాను, భాగ్యలక్ష్మి, రజనీ ప్రియ పాల్గొన్నారు.

'సూక్ష్మ' పరికరాల పంపిణీ వేగవంతం చేయండి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏపీఎంఐపీ పీడీ, ఏపీడీ, కంపెనీ డీసీఓలు

అనంతపురం అగ్రికల్చర్: సూక్ష్మ సేద్యం (డ్రిప్, స్ప్రింక్లర్లు) పరికరాల పంపిణీ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఉద్యానశాఖ కమిషనర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. సూక్ష్మ సేద్యం పరికరాల పంపిణీపై ప్రాజెక్టు ఆఫీసర్ (పీఓ) ఎం.వెంకటేశ్వర్లుతో కలసి మంగళవారం గుంటూరు నుంచి జిల్లా ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్, కంపెనీ డీసీఓలు, ఎంఐ ఇంజినీర్లతో ఆయన సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 7,532 మంది రైతులకు సంబంధించి 7,793 హెక్టార్లకు పరికరాలు ఇవ్వడానికి అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన రెండు నెలల కాలంలో 10 వేల హెక్టార్ల వరకు ఇవ్వాల్సి ఉందన్నారు. పరికరాల నాణ్యతలో రాజీపడేది లేదని, రైతు పొలాల్లో బిగించి ట్రయల్‌రన్ చేసిన తర్వాతనే సొమ్ము విడుదల చేస్తామని తెలిపారు. ప్రాథమిక పరిశీలన (పీఐఆర్), తుది పరిశీలన (ఎఫ్ఐఆర్), బీవోక్యూ, బీఎంసీ లాంటి ప్రక్రియలు వేగవంతం చేస్తే గడువు లోపు అనుకున్న లక్ష్యం సాధించవచ్చన్నారు. ఇప్పటికే 10,275 మంది రైతులు తమ వాటా చెల్లించారని పీడీ, ఏపీడీ తెలిపారు. మరో 8 వేల మంది రైతులు తొందరగా చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సంఘాన్ని ప్రేమించాలి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ రాచానపల్లి సమీపంలోని యేసుకృపా మందిరంలో మంగళవారం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 55వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ నిజామాబాద్ జిల్లా నిర్మల్ నిస్సి మినిస్ట్రీస్ అపోస్తలుడు జయరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవుడు తన స్వరక్త మిచ్చి సంపాదించిన సంఘాన్ని మనము ప్రేమించాలన్నారు. సహోదరులు ఐక్యత కలిగి ఉండాలని సూచించారు. అనంతరం సభ్యులందరికీ బ్యాగులు పంపిణీ చేశారు. సమావేశంలో తాడిపత్రి పాస్టర్ క్రిస్టఫర్, అసోసియేషన్ గౌరవ సలహాదారులు పాస్టర్ సంపత్ కుమార్, గౌరవ సలహాదారులు బ్రదర్ చల్లా కిషోర్ కుమార్ చౌదరి, వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ పి.మార్క్, జాయింట్ సెక్రెటరీ పాస్టర్ వి.మనష్షే, ట్రెజరర్ పాస్టర్ కె.జీవన్ బాబు పాల్గొన్నారు.

అనంతవాసులకు 'తెలుగు కీర్తి పురస్కారాలు'

అనంతపురం కల్చరల్: విజయవాడ శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారికి మంగళవారం 'తెలుగు కీర్తి పురస్కారాలు' ప్రదానం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా సాహిత్యానికి దశాబ్దాలుగా సేవలందిస్తున్న సీనియర్ రచయిత, అనువాదకుడు డాక్టర్ రమేష్ నారాయణ, సేవా రంగంలో ఎస్ఆర్ ఎడుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు సుంకర రమేష్‌ను ఎంపిక చేసి అవార్డులు అందజేశారు. శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, బోయి భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ చైర్‌పర్సన్ హైమావతి, అంతర్జాతీయ సమన్వయకర్త, జాతీయ కన్వీనర్ ఈశ్వరి భూషణం తదితరులు వీరిని సత్కరించారు. కీర్తి పురస్కారాలు అందుకున్న అనంతవాసులను సాహిత్య భారతి, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి ప్రతినిధులు అభినందించారు.

పింఛన్ల పరిశీలన


బొమ్మేపర్తిలో లబ్ధిదారుడి వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారులు

రాప్తాడు: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచానికే పరిమితమై పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను మంగళవారం కర్నూలు వైద్యాధికారుల బృందం పరిశీలించింది. 6 మంది డాక్టర్లు మూడు బృందాలుగా ఏర్పడి మండలంలోని పలు గ్రామాల్లోని దీర్ఘకాలిక పింఛన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ.. మండలంలో వైకల్య ధ్రువీకరణ పత్రాల ద్వారా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్ల వద్దకు కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్లు చంద్రశేఖర్, వలి బాషా, ప్రణీత్ కుమార్ రెడ్డి, గోపి చంద్, అమర్‌నాథ్, రామయ్య బృందం ఇంటింటికి వెళ్లి పింఛన్లను పరిశీలిస్తోందని తెలిపారు. వైకల్య ధ్రువీకరణ పత్రాలు నకిలీవి అని తేలితే అటువంటి పింఛన్లను తొలగించడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు ఎండోమెంట్ కార్యాలయం వద్ద నిరసన

అనంతపురం కల్చరల్: అర్చకులపై జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా బుధవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ఎండోమెంట్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాల అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో సాగే కార్యక్రమంలో అర్చకులందరూ విచ్చేసి సంఘీభావం తెలపాలని కోరారు. అలాగే ఆలయాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

'రజకుల సమస్యలను పరిష్కరిస్తాం'

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర వ్యాప్తంగా రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ.. జిల్లాలోని గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, అనంతపురం టౌన్ ప్రాంతాల్లో పర్యటించడం జరిగిందన్నారు. ఆర్థికసాయం కావాలని పలువురు కోరినట్లు తెలిపారు. పది సంవత్సరాల క్రితం నిర్మించిన ధోబీఘాట్లు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. అప్పటి నుంచి ఎలాంటి మరమ్మతులు చేయలేదన్నారు. రజకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో ఉమ్మడి జిల్లాలో కమిటీలు వేస్తామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో బట్టలు ఉతికేందుకు రజకులకు అవకాశాలు వచ్చేలా ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ రామాంజి, అధికారులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రత


డ్రోన్ల ద్వారా జాతర పరిసరాలను పరిశీలించిన దృశ్యం

అనంతపురం: జిల్లాలో పలు ప్రాంతాల్లో మంగళవారం జాతర, గ్రామ దేవర్లు జరిగాయి. గ్రామాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా డ్రోన్లతో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. భారీగా ప్రజలు రావడంతో గొడవలు, అల్లర్లు , దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా డ్రోన్ల ద్వారా పర్యవేక్షించారు.

గ్రామాల్లో జాతర సందడి


అలంకరణలో ముత్యాలమ్మ దేవత


పూజలందుకున్న పెద్దమ్మ దేవత


వై.కొత్తపల్లిలో జరిగిన జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, తదితరులు


పెద్దమ్మ జాతరలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్

రాప్తాడు: మరూరు గ్రామంలో పెద్దమ్మ దేవరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి నుంచి పెద్దమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. సోమవారం అర్ధరాత్రి పెద్దమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం రాత్రి 12 గంటలకు పెద్దమ్మ దేవతకు దున్నపోతును బలి ఇచ్చారు. గ్రామంలో 50 ఏళ్ల తర్వాత దేవర నిర్వహించడంతో ప్రజలు పోటెత్తారు. పెద్దమ్మ దేవరకు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో మరూరు జనసంద్రమైంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నారు. పొట్టేళ్లు, మేకలను అమ్మవార్లకు మొక్కుబడి కింద బలి ఇచ్చారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

దేవరకు హాజరైన నాయకులు

పెద్దమ్మ దేవరకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, జెడ్పీటీసీ చంద్రకుమార్, మారుతి ప్రసాద్, ఆత్మకూరు ఎంపీపీ సుబ్బరహేమలత, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మాజీ మేయర్ రాగే పరుశురాం, వైఎస్సార్‌సీపీ నాయకులు భూమిరెడ్డి మహానంది రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్ రెడ్డి, నసనకోట ముత్యాలమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాలు, మండల కన్వీనర్లు జూటూరు శేఖర్, మీనుగ నాగరాజు, గోవింద్ రెడ్డి, నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి , మహిళా నాయకురాలు శివబాల తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని వై.కొత్తపల్లి గ్రామంలో పెద్దమ్మ, నల్లలమ్మ జాతర మంగళవారం ముగిసింది. జాతర చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు గంగుల భానుమతి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పలువురు నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి విందులో పాల్గొన్నారు. సీఐ హేమంత్ కుమార్, ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించారు.

కుష్టుపై ఆందోళన అవసరం లేదు

చెన్నేకొత్తపల్లి: కుష్టుపై ఆందోళన చెందాల్సిన పనిలేదని, వ్యాధి ప్రారంభంలోనే చికిత్స తీసుకుంటే నయమవుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ రవి నాయక్ అన్నారు. మేడాపురంలో ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ సిబ్బంది చేపట్టిన కుష్టు సర్వేను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వైద్య సిబ్బందితో సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి సర్వేలో శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉన్నవారిని గుర్తించాలన్నారు.